సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



వలసలు ముమ్మరం

పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్ పార్టీ చేరికలను ముమ్మరం చేసింది. 8లో ▸



గ్రామీణులపై అధ్యయనం

తెలంగాణ వర్సిటీ విద్యార్థులు సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులుగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
శుక్రవారం	శనివారం
సాయంత్రం	ఉదయం
6:35	4:44

న్యూస్‌రీల్

బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా అశోక్ నియామకం



అశోక్‌ను సన్మానిస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన ప్యాట అశోక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌ను గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పీఎం మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, యుగేందర్, సందీప్‌యాదవ్, సుబ్రహ్మణ్యం, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధికార ప్రతినిధిగా భగీరథ్



కడ్తాల్: బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మండల కేంద్రానికి చెందిన కాంటేకర్ భగీరథ్ నియమితులయ్యారు. కేంద్ర మంత్రి, బీజేపీ రా ష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భగీరథ్ మాట్లాడుతూ.. పార్టీ తన సేవలను గుర్తించి బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి నియమించడం ఆనందంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యు డు ఆచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క న ర్సింహారెడ్డికి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మ హేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పా ర్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చే స్తూ.. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయా నికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలి

ఆర్‌ఎంపీల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న సతీశ్‌కుమార్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలని ఆర్‌ఎంపీల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జె.సతీశ్‌కుమార్ కోరారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఆర్‌ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009–10 సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జీఓ నెంబర్ 420తో ఏడాది పాటు ఉమ్మడి రాష్ట్రంలో శిక్షణ ఇప్పించారని గుర్తు చేశారు. వారి మరణాంతరం శిక్షణ నిలిచిపోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రక్రియను పునరుద్ధరిస్తే గ్రామాల్లో పేదలకు పనిచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో రవియాదవ్, రవికుమార్‌యాదవ్, జగదీశ్వర్, కుమార్ యాదవ్, కె.జగన్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ మంత్రి సబితారెడ్డి

కందుకూరు: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రమాదవశాత్తు గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి పంపి మానవత్వం చాటుకున్నారు. గురువారం ఆమె మండల పరిధిలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. బైరాగిగూడ సమీపంలో రాచలూరుకు చెందిన కుమ్మరి రమేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే తన వాహనాన్ని క్షతగాత్రుడి గాయాలను పరిశీలించారు. తాగునీరు ఇచ్చి ఆస్పత్రికి తరలించే ఏర్పాటు చేయించారు. ఆమె వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులున్నారు.



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడలో.. తెలంగాణ జన జాతర

కాంగ్రెస్ పార్టీ ప్రజాదరణను దేశానికి చాటేలా ఏర్పాట్లు

- 25 ఎకరాల్లో రాజీవ్ ప్రాంగణం
- మహిళలకు ప్రత్యేక గ్యాలరీలు
- ఏర్పాట్లను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు
- రేపు సాయంత్రం 5 గంటలకు ఐదు జాతీయ గ్యారంటీల ప్రకటన



రాజీవ్ ప్రాంగణంలో కొనసాగుతున్న ఏర్పాట్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇక్కడి నుంచే ఆరు గ్యారంటీలను ప్రకటించి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లోనూ సెంటిమెంట్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. సెప్టెంబర్ 17న ఏర్పాటు చేసిన సభా ప్రాంగణాన్నే జాతీయ గ్యారంటీల ప్రకటనకు వేదికగా చేసుకుంది. 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన వేదికకు ఇరు వైపులా భారీ వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. రాజీవ్ ప్రాంగణంగా నామకరణం చేసిన వేదికపై ఏఐసీసీ ముఖ్య నేతలు సహా ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు 250 మంది వరకు ఆసీనులయ్యేలా భారీ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన వేదిక సహా లైటింగ్, సౌండ్ సిస్టం ఏర్పాటు, కుర్చీలు, గ్యాలరీల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 6న సాయంత్రం ఐదు గంటలకు ఏఐసీసీ ముఖ్య నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్య నేతలు హాజరై.. కాంగ్రెస్ జాతీయ గ్యారంటీలను ప్రకటించనున్నారు.

వరుస సమీక్షలు

ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు, వరంగల్ నుంచి మహబూబ్‌గర్ వరకు.. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి భారీగా జనాన్ని సమీకరించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు తుక్కుగూడలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేదిక నుంచి కాంగ్రెస్‌కు తెలంగాణలో ప్రజాదరణను దేశానికి చాటి చెప్పనుంది. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ ముఖ్య నేతలంతా ఈ సభకు హాజరు కానుండటంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం తుక్కుగూడలో పర్యటించి ఏర్పాట్లను సమీక్షించారు. తర్వాత రెండో రోజూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. తాజాగా గురువారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభా స్థలిని సందర్శించి, ఏర్పా ట్లపై ఆరా తీశారు.సాయంత్రం ఏడు గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు మంత్రులు తుక్కుగూడకు చేరుకుని ఏర్పాట్లపై సమీక్షా సమావేశం ఏర్పాటు చే శారు.జన సమీకరణ, రవాణా సదుపాయం,వచ్చిన కార్యకర్తలకు ఆహారం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం మొదలు.. సభాస్థలి ఏర్పాట్ల వరకు అంశాల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, ఆయా పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

చేరికలకు యాక్షన్ ప్లాన్..?

ఓ వైపు మహా జనజాతరకు ఏర్పాట్లు చేస్తూనే.. మరో వైపు బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి భారీ చేరికలకు వ్యూహాలు రచిస్తున్నారు. ఇప్పటికే చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ, ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి సహా వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్లు పట్నం సునీతారెడ్డి, తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సహా ఇతర ముఖ్య నేతలను పార్టీలోకి ఆహ్వానించి బీఆర్‌ఎస్‌కు వరుస షాక్‌లు ఇస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూనే.. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పాపాలను కడిగి పారేస్తున్నారు. ధరణి పోర్టల్ లోపాలు, కాళేశ్వరం ప్రాజెక్టుకు పగుళ్లు, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలతో ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ను గుక్కతిప్పుకోకుండా చేస్తున్నారు. తుక్కుగూడ వేదికగా నిర్వహించే ఈ జనజాతర సభకు ఏఐసీసీ ముఖ్య నేతలు హాజరవుతుండటంతో వీరి సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి మూకుమ్మడి జాయినింగ్‌లకు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఇదే వేదికగా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వీరిలో జిల్లాకు చెందిన పలువురు ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు కూడా ఉండనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

మెట్రో స్టేషన్లలో 'ఆఫీస్ బబుల్స్'

- హైటెక్ సిటీ, దుర్గం చెరువు, మాదాపూర్‌లలో ఆవిష్కరణ



ఆఫీస్ బబుల్స్‌ను పరిశీలిస్తున్న ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రో రైల్ వినూత్నమైన పద్ధతిలో మెట్రో స్టేషన్లలో 'ఆఫీస్ బబుల్స్'ను ఆవిష్కరించింది. మెట్రో స్టేషన్లలోనే కార్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న సంస్థలకు సురక్షితమైన రిమోట్ కో–వర్కింగ్ స్పేస్‌లుగా ఇవి దోహదపడనున్నాయి. నగరంలో ఆఫీస్ వర్క్‌స్పేస్‌లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఎల్ అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్ సంస్థ పేర్కొంది. విస్తృతమైన మెట్రో నెట్‌వర్క్ సదుపాయం ఉన్న అన్ని మెట్రో స్టేషన్లలో వ్యూహాత్మకమైన శాటిలైట్ ఆఫీసులను ఏర్పాటు చేసుకోవచ్చని అధికారులు చెప్పారు. హైటెక్ సిటీ, దుర్గం చెరువు, మాదాపూర్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఆఫీస్ బబుల్స్‌ను ఎల్ అండ్‌టీ మెట్రో రైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి.రవిశంకర్, ట్రెండ్జ్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. శివ శరత్ రెడ్డి సారథ్యంలోని ట్రెండ్జ్ వర్క్‌స్పేస్ సంస్థ మెట్రోస్టేషన్లలో కమర్షియల్ ఆఫీస్ స్పేస్ ఆపరేటరుగా వ్యవహరించనుంది. ఈ మేరకు హైటెక్ సిటీ, దుర్గం చెరువు, మాదాపూర్ మెట్రో స్టేషన్లలో సుమారు 10 వేల చదరపు అడుగుల స్థలాన్ని ట్రెండ్జ్ సంస్థ లీజుకు తీసుకుంది. ఐటీ, ఫైనాన్స్, కన్‌స్ట్రక్షన్, తదితర రంగాలకు చెందిన సంస్థలు ఆఫీస్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. 'ఆఫీస్ బబుల్స్' కాన్సెప్ట్‌తో సిబ్బంది రాకపోకలకు సైతం అనుకూలంగా ఉంటుందని చెప్పారు.

ఆదాయం అదుర్స్



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

- ఉమ్మడి రంగారెడ్డి ఆర్టీఏ ఆదాయం రూ.3,067 కోట్లు
- డీటీసీ చంద్రశేఖర్ గౌడ్ వెల్లడి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రవాణా శాఖ ఆదాయంలో ఉమ్మ డి రంగారెడ్డి జిల్లా టాప్‌లో నిలిచింది. రంగారెడ్డి, మేడ్చల్‌– మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరం రూ.3067 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ వెల్లడించారు. ఈ మేరకు మణికొండలోని తన కార్యాలయంలో వివిధ జిల్లాలకు చెందిన అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన రూ.3143 కోట్ల లక్ష్యానికి చేరువైనట్లు పేర్కొన్నారు. మరోవైపు గత సంవత్సరం ఆదాయంతో పోలిస్తే 9.9 శాతం వృద్ధి రేటును సాధించినట్లు చెప్పారు. జిల్లాలవారీగా రంగారెడ్డిలో రూ.1,689 కోట్లు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రూ.1,298 కోట్లు వికారాబాద్‌లో రూ.80 కోట్లు లభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది రవాణాశాఖ రాష్ట్రవ్యాప్తంగా పొందిన రూ.6,972 కోట్ల ఆదాయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆదాయం 44 శాతం ఉందన్నారు. వాహనదారులు త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించాలని సూచించారు.పన్ను చెల్లించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పన్నులు చెల్లించకుండా పట్టుబడే వాహనాలను జప్తు చేయడంతో పాటు భారీ ఎత్తున జరిమానా విధించనున్నట్లు ఆయన హెచ్చరించారు. పరిమితికి మించిన బరువుతో వెళ్లే ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్టీఓలు రఘునందన్, సుభాషచందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్, ఏఓ శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు జుమ్మాతుల్ విదా

సాక్షి, సిటీబ్యూరో: జుమ్మాతుల్ విదాను (రంజాన్ మాసంలో వచ్చే చివరి శుక్రవారం) పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జుమ్మాతుల్ విదా రోజు ముస్లింలు జుమా నమాజ్‌ను నగరంలోని జామే మసీదులో (పెద్ద మసీదుల్లో) చదవడానికి ఇష్టపడతారు.దీంతో పాటు చారిత్రాత్మక మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహిచడానికి ప్రాధాధామిస్తారు. నగరంలోని వివిధ మసీదుల్లో జుమ్మాతుల్ విదా జుమా ఖుత్బ కోసం ముఫ్తీలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మౌలానాలు, మత గురువుల ప్రసంగాలు ఉంటాయి.

రూ.25లక్షల నకిలీ కరెన్సీ పట్టివేత

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

పహాడీషరీఫ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలో నకిలీ నోట్లు పట్టుబడడం కలకలం రేపింది. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రకుంటలో రూ.25 లక్షల నకిలీ నోట్ల చలామణి విషయమై సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. నిందితులు షేక్ హరూన్, సయ్యద్ నగీర్, జాకీర్ సయ్యద్, అలీ అఫ్తాబ్ అక్తర్‌లు ఈ నోట్లను మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి తదుపరి విచారణ నిమిత్తం బాలాపూర్ పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి నకిలీ చిల్డ్రన్స్ కరెన్సీ, కారు, ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.



పట్టుబడ్డ చిల్డ్రన్స్ కరెన్సీ



అవిశ్వాస సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

'కారు'కు షాక్.. నెగ్గిన అవిశ్వాసం

- 'పట్నం' వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా 17 మంది ఓటు
- ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నమోదు చేయించుకున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఓ వైపు పార్టీ లీడర్లంతా కారు దిగుతుంటే.. మరో వైపు స్థానిక సంస్థల్లో పట్టు తగ్గుతోంది. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. మార్చి 11న మున్సిపల్ కౌన్సిలర్లు 14 మంది వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందజేశారు. దీంతో ఏప్రిల్ 4న కలెక్టర్ ఓటింగ్‌కు అనుమతిచ్చారు. ఉదయం 10.30గంటలకు ఇబ్రహీపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించి మున్సిపల్ కార్యాలయంలో ఓటింగ్ ఏర్పాటు చేశారు. 11గంటల వరకు కౌన్సిలర్లు హాజరవ్వలేదు. 11.30గంటలకు సభ్యులు ప్రత్యేక బస్సులో కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ప్రిసైండింగ్ అధికారి నియమనిబంధనలు కౌన్సిలర్లకు చదివి వినిపిచారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లుండగా.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో 25మందికి చేరింది. ఈ సమావేశానికి 17 మంది సభ్యులు హాజరై అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. ప్రత్యర్థులు, వ్యతిరేకించేవారు లేకపోవడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి ప్రకటించారు.

బీఆర్‌ఎస్‌కు చెందిన తొమ్మిది మంది మద్దతు

బీఆర్‌ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిని తొలగించడానికి అదే పార్టీకి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. అవిశ్వాసానికి సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. ఏడుగురు కాంగ్రెస్ నుంచి, బీఆర్‌ఎస్ నుంచి తొమ్మిది మంది, ఒక ఎక్స్ అఫిషియో సమావేశానికి హాజరవ్వగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన ఆరుగురు, బీజేపీ నుంచి ఇద్దరు గైర్హాజరయ్యారు.

నేడు రైతు సత్యాగ్రహ దీక్ష

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా రైతన్నల సమస్యల పరిష్కారంలో విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజున రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని నేటికీ ఆ ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు బంధు పత్తా లేదనన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ధరణి క్యాంపులు నిర్వహించి గాలికొదిలేశారన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నామని.. ఈ దీక్షకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ హాజరవుతారని చెప్పారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే దీక్షకు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాపయ్యగౌడ్, బోసుపల్లి ప్రతాప్, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, నర్సింహారెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- అనుదీప్ దురిశెట్టి

హిమాయత్‌నగర్: భారత ఎన్నికల సంఘం గుర్తించిన అత్యవసర సర్వీస్ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించేందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌పై జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఒక నోడల్ అధికారి నియమించుకుని ఆ వివరాలను అందజేయాలన్నారు. సమావేశంలో కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ ఆకాష్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి డిప్యూటీ కలెక్టర్ అర్చన, అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్) మంగతాయారు పాల్గొన్నారు.

12 నుంచి బంజారా ప్రీమియర్ లీగ్

గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్

కద్తాల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 12 నుంచి గోర్ బంజారా జాతీయ స్థాయి ప్రీమియర్ లీగ్ (క్రికెట్ టోర్నమెంట్) నిర్వహిస్తున్నట్లు గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్ఎల్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టోర్నమెంట్‌కు సంబంధించి బ్రోచర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హన్మానాయక్ మాట్లాడుతూ.. ఏడేళ్లుగా సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గోర్ బంజారా జాతీయ స్థాయి ప్రీమియర్ లీగ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక తదితర రాష్ట్రాలకు సంబంధించిన క్రికెటర్లు పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 10వ తేదీ లోపు జట్ల వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.



టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హన్మానాయక్, నాయకులు

టోర్నీలో మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు అందిస్తారన్నారు. వివరాలకు 83282 13147, 90103 22645 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇస్లావత్ బలరాంనాయక్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, భీమారావునాయక్, రవిరాథోడ్, నరేశ్‌నాయక్, హున్యానాయక్, మోహన్‌నాయక్, గిరిజన విద్యార్థి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వలసలు ముమ్మరం

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా /చేవెళ్ల: పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్ పార్టీ చేరికలను ముమ్మరం చేసింది. చేవెళ్ల లోక్‌సభ స్థానంలోని ఇతర పార్టీలకు చెందిన అనేక మందిని తమ పార్టీలో చేర్చుకుంది. సిటింగ్ ఎంపీ సహా జెడ్పీ చైర్‌పర్సన్లు, మాజీ ఎమ్మెల్యేలను పార్టీలోకి ఆహ్వానించి ప్రతిపక్ష పార్టీలకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోంది. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థి డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి నేతృత్వంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ముఖ్య కార్యకర్తలు పార్టీలో చేరారు. గురువారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వీరిలో సరూర్‌నగర్ మాజీ జెడ్పీటీసీ జిల్లెల నరేందర్‌రెడ్డి, కందుకూరు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సిద్దాల దశరథ, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు బచ్చనబోయిన నరసింహాయాదవ్, కార్పొరేటర్ బచ్చనబోయిన పద్మ, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి అనితానాయక్, తుక్కుగూడ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ భవానీవెంకట్‌రెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు ఇక్బాల్‌బిన్‌ఖలీఫా, జల్‌పల్లి వైస్‌చైర్మన్ యూసుఫ్‌పటేల్, కౌన్సిలర్ తేజస్విని‌శ్రీకాంత్, కొండల్‌యాదవ్, కౌన్సిలర్‌అవల్గీ, మాజీ సర్పంచ్ వనిత నరేందర్ రెడ్డి భారీ సంఖ్యలో ఇతర పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

శంకర్‌పల్లి జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్‌పర్సన్

చేవెళ్ల పార్లమెంట్‌పై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి, పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సమక్షంలో శంకర్‌పల్లికి చెందిన జెడ్పీటీసీ గోవిందమ్మగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు లక్ష్మమ్మ, శ్వేతాపాండురంగారెడ్డి, చంద్రమౌళి, అశోక్, శ్రీనాథ్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు రజినిశ్రీనివాస్, మహమూద్‌లతోపాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్

గ్రామీణుల స్థితిగతులపై అధ్యయనం

క్షేత్రస్థాయిలో పర్యటించిన తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు

కద్తాల్: తెలంగాణ విశ్వ విద్యాలయం సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్‌లో భాగంగా మూడు రోజులుగా మండలంలో పర్యటించారు. యూనివర్సిటీ విద్యార్థులు నాలుగు జట్లుగా ఏర్పడి అన్మాస్‌పల్లి, జమ్ములాబావితండా, సాయిరెడ్డిగూడెం గ్రామాలను సందర్శించారు. ప్రజలతో మమేకమై వారి జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, విద్యా, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలను తెలుసుకున్నారు. ఈ మేరకు గ్రామాలలో సేకరించిన అంశాలను గురువారం ఎర్త్‌సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్రరూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని పెంపొందించడం, స్థిరమైన అభివృద్ధికి పాటు పడటం ద్వారా గ్రామీణుల జీవితాలను మెరుగుపరుచవచ్చని సూచించారు. బలమైన స్వయం సహాయక సంఘాల అభివృద్ధి చేయడంతో పాటు నూతన విధానాలను రూపొందించాలన్నారు. ప్రకృతి పరమైన సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై వివరించి సహకారం అందిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. తెలంగాణ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ.. మూడు రోజులుగా క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా సీజీఆర్ సంస్థ అందించిన సహకారం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు సీజీఆర్ సంస్థ ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్యులు యాలాద్రి, డాక్టర్ రమాదేవి, పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి, సీనియర్ పోగ్రాం అధికారులు వెంకటేశ్, నగేశ్, బాలచైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి పర్యటనలో విశ్వవిద్యాలయం విద్యార్థులు, ఆచార్యులు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

11 మంది అరెస్టు, రూ.1.25 లక్షలు స్వాధీనం

మహేశ్వరం: గుట్టు చప్పుడు కాకుండా ఓ ఫామ్ హౌస్‌లో పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. ఇందులో 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.25 లక్షల నగదు, మూడు కార్లు, నాలుగు బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని తుమ్మలూరులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో ఓ ఫామ్ హౌస్‌లో అదే గ్రామానికి చెందిన తులసిరెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శివకుమార్, గణేష్, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, గణేష్, శేఖర్‌రెడ్డిలు పేకాట ఆడుతున్నారు. ఎస్ఓటీ పోలీసులు పక్కా సమాచారంతో దాడులు చేసి 11 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి నగదు, కార్లు, బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ దాడిలో మహేశ్వరం ఎస్ఓటీ సీఐ సైదాబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ధరణి లొసుగులతో పెరిగిన భూ విస్తీర్ణం



శంకరాపురంలోని వివాదాస్పదంగా మారిన భూమి

- కబ్జాకు యత్నిస్తున్నారని రైతుల ఆందోళన
- తమ దృష్టికి రాలేదన్న తహసీల్దార్

శంషాబాద్ రూరల్: ధరణిని అడ్డుపెట్టుకుని రికార్డుల్లో భూ విస్తీర్ణాన్ని పెంచిన అక్రమార్కులు పట్టా భూములను కబ్జా చేస్తున్నారని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండలంలోని శంకరాపురం రెవెన్యూలోని సర్వే నంబరు 24లో 57 ఎకరాల 5 గుంటల భూమి ఉంది. ఇందులో 30 ఎకరాలు గైరాన్ కాగా.. 27 ఎకరాల 5 గుంటలను కొంతమంది పేద రైతులకు అసైన్డ్ చేశారు. అయితే అసైన్డ్ పట్టాదారుల నుంచి రియల్టర్లు 10 ఎకరాలు కొనుగోలు చేశారు. ఈ సర్వే నంబరులో మరో ఐదెకరాల విస్తీర్ణాన్ని రికార్డులో చేర్చారు. సదరు స్థలంలో అక్రమ నిర్మాణాలకు పూనుకున్నారని చెబుతున్నారు. గత కొద్ది రోజుల నుంచి ఈ భూమి చదును, ప్రహరీ నిర్మాణం చేపట్టారు. వారు కొనుగోలు చేసిన పదెకరాలకు తోడు కొత్తగా సృష్టించిన ఐదెకరాలను సొంతం చేసుకోవడానికి యత్నిస్తున్నారని ఆరోపణలున్నాయి. దీనికోసం సదరు భూమి పక్కన ఉన్న పట్టా భూముల్లోకి చొరబడి కబ్జాకు యత్నిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందరికీ న్యాయం చేయాలి..

సర్వే నంబరు 24లో కొంత మంది భూములను పట్టా భూములుగా మార్చిన అధికారులు మిగతా రైతులకు కూడా పట్టాలు ఇచ్చి సమన్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరో వైపు సర్వే నంబర్లలో అదనపు భూ విస్తీర్ణాన్ని సృష్టించి పట్టా రైతుల పొలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా వెంచరు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులకు అధికారులు స్పందించడం లేదని తాజాగా డీజీపీ, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్లు రైతులు పేర్కొన్నారు. వివరణ కోసం తహసీల్దార్ నాగమణిని సంప్రదించగా.. ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదని వివరణ ఇచ్చారు.

సదరం స్లాట్ బుక్ చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: ఏప్రిల్, మే నెలలకు సంబంధించి దివ్యాంగుల సదరం స్లాట్లను బుక్ చేసుకోవడానికి మీసేవలో ఈ నెల 8 నుంచి అవకాశం కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన వారే ఈ స్లాట్లను బుక్ చేసుకోవాలన్నారు. కొండాపూర్ జిల్లా ఆస్పత్రి, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిల్లో నిర్వహిస్తారన్నారు. క్యాంపునకు వచ్చే దివ్యాంగులు తప్పనిసరిగా మీ సేవలో స్లాట్‌బుక్ చేసుకొని రశీదుతో ఆస్పత్రికి రావాలన్నారు. దరఖాస్తుదారులు డాక్టర్ రిపోర్టుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఫొటో తీసుకురావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కద్తాల్: శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చల్లంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వంపుగూడ గ్రామానికి చెందిన పోతుగంటి రామకృష్ణ ద్విచక్రవాహనంపై మైసిగండి వైపు వెళుతున్నాడు. మార్గమధ్యలో ఎస్ఎల్ఆర్ గార్డెన్ సమీపంలో కారు అతివేగంతో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగ్రాతున్ని చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్టుషాపుపై పోలీసుల దాడి

తలకొండపల్లి: పోలీసులు బెల్టు షాపుపై దాడి చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాతాకోటతండాలో పాత్లావత్తు తిరుపతి తన కిరాణా షాపులో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నాడని పక్కా సమాచారం మేరకు పోలీసులు గురువారం దాడి చేశారు. 12 క్వార్టర్లు, ఒక బీరు కాటన్ స్వాధీనం చేసుకున్నారు. దీంతో తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ చెప్పారు.

చోరీకి పాల్పడుతున్న డ్రైవర్లపై కేసు నమోదు

కొందుర్గు: ఇనుప చువ్వలు తరలిస్తున్న లారీలో డ్రైవర్లు చేతివాటం ప్రదర్శిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన గురువారం మండలంలోని శ్రీరంగాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు శివారులోని స్కాన్ ఎనర్జీ పరిశ్రమకు సంబంధించిన లారీ, వికారాబాద్ జిల్లా పరిగి మండలం చిట్యాల శివారులోని ద్వారకా ఐరన్ పరిశ్రమకు చెందిన మరో వాహనం శ్రీరంగాపూర్ లక్ష్మీదాబా వద్ద నిలిచి ఉన్నాయి. అక్కడ జనాలు గుమిగూడటంతో పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రెండు వాహనాల నుంచి ఇనుప చువ్వలను ఇతర వాహనంలోకి డంపు చేస్తుండగా.. పోలీసులు అందుకు ధ్రువపత్రాలు చూపాలని డ్రైవర్లను ఆదేశించారు. పత్రాలు లేకపోవడంతో డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. ట్రాన్స్‌పోర్టు సమయంలో కొంత చువ్వలను విక్రయిస్తుంటామని, సదరు డబ్బులు పరిశ్రమ యాజమాన్యానికి తెలియకుండా తీసుకుంటామని డ్రైవర్లు తెలిపారు. ఈ విషయమై చోరీకి పాల్పడుతున్న సతీశ్, సురేశ్‌లతోపాటు తక్కువ ధరకు వస్తుందని సీకులు కొనుగోలు చేసిన అతిక్, శేఖర్, బాకీద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై కృష్ణయ్య తెలిపారు.

గంజాయి పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: ఇద్దరు యువకుల నుంచి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముందస్తు సమాచారంతో ఇబ్రహీంపట్నం భారత్‌గార్డెన్ సమీపంలో ఉన్న ఇద్దరు యువకులు నుంచి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నిజాం మ్యూజియంలో ఫొటో ఎగ్జిబిషన్

యాకుత్‌పురా: రంజాన్ నేపథ్యంలో పాతబస్తీ పురానీహవేలీలోని హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం సిటీ గ్యాలరీలో ఇస్లాం మత గ్రంథం ఖురాన్ ప్రాముఖ్యతపై ఏర్పాటు చేసిన గ్లోరియస్ ఉచిత ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమీర్–ఇ–మిల్లాత్–ఇ–ఇస్లామీయా సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నిర్వాహకులు రెండో మౌలానా మహ్మద్ హుసాముద్దీన్ జఫర్ పాషా ప్రారంభించారు. అనంతరం ఆయన ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఫొటోలను తిలకించారు. ఫొటోలు, ఖురాన్‌కు సంబంధించిన చిత్రాల ప్రాముఖ్యతను మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ అహ్మద్ అలీ వివరించారు. కార్యక్రమంలో మ్యూజియం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సయ్యద్ హైదర్ హుస్సేనీ, పలువురు ఇస్లాం ప్రముఖులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మౌలానా మహ్మద్ హుసాముద్దీన్ జఫర్ పాషా

నిబంధనలు పాటించాల్సిందే..

- ఎయిర్‌పోర్టు సమీపంలోని నిర్మాణాల ఎత్తుపై ఆంక్షలు
- ఇప్పటికే ప్రహరీ సమీపంలో భారీ నిర్మాణాలు
- మున్సిపాలిటీ నుంచి వివరాలు సేకరించిన ఎయిర్‌పోర్టు భద్రతా విభాగం
- ఎన్‌ఓసీ లేకుంటే చర్యలు తప్పవు

శంషాబాద్ : ఎయిర్‌పోర్టు భద్రతా విభాగం మరోసారి అప్రమత్తమైంది. ఎయిర్‌పోర్టుకు ప్రహరీకి అత్యంత సమీపంలో చేపట్టే నిర్మాణాలు, హోర్డింగ్‌లు, చెట్ల పెంపకంపై వాటి ఎత్తులపై ఆంక్షలు విధించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్‌ను పొంది వారి నిబంధనలకు అనుగుణంగానే ఇక్కడ కట్టడాలు చేపట్టాల్సి ఉంటుంది. గత కొన్నేళ్లుగా ఎయిర్‌పోర్టు ప్రహరీని ఆనుకుని అనేక అక్రమ వెంచర్లు వెలిశాయి. ధర్మగిరి రహదారి ఏకే టౌన్‌షిప్ తదితర వెంచర్లు ఇందులో ఉన్నాయి. మరో వైపు గొల్లపల్లి పరిధిలో భారీ వెంచర్ ఏర్పాటు చేయడంతో పాటు అక్కడ విలాసవంతమైన భారీ బంగ్లాలు నిర్మాణాలు ఊపందుకున్నాయి. భవిష్యత్తులో విమానాల రాకపోలు, భద్రతా విషయంలో ఎత్తైన నిర్మాణాలు ఇబ్బందికరంగా పరిణమించే అవకాశముందని భావించిన ఎయిర్‌పోర్టు భద్రతా విభాగం మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా ఆయా నిర్మాణాల వివరాలు సేకరించింది. కొన్ని నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించింది. ఇకపై ప్రహరీ సమీపంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా వాటి ఎత్తుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఎయిర్‌పోర్టు అథారిటీ విభాగానికి దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాల్సిందిగా పోస్టర్లను సైతం విడుదల చేసింది. నిబంధనలకు వ్యతిరేకంగా చేపట్టబోయే నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని నిర్మాణదారులు సీరియస్‌గా పరిగణించాలని పేర్కొంది. ఈ మేరకు మున్సిపాలిటీల అధికారులకు సైతం సూచనలు చేసింది.



ఏరోడ్రోమ్ సేఫ్టీసెల్ విడుదల చేసిన పోస్టర్

ఎలాంటి అనుమతులు లేవు

ఎయిర్‌పోర్టు ప్రహరీ సమీపంలోని ఏ వెంచర్‌లో కూడా నిర్మాణాలకు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతి లేదు. జీవో 111 పరిధిలో ఉన్న కారణంగా అనుమతులు జారీ చేసే అవకాశం లేదు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఇటీవల ఇందుకు సంబంధించిన వివరాలు సేకరించింది.

–శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ అధికారి

అగ్గిపెట్టె అడిగి.. సెల్‌ఫోన్ లాక్కెళ్లాడు

పంజగుట్ట: అగ్గిపెట్టె ఉందా అంటూ మాటలు కలిపి సెల్‌ఫోన్ లాక్కుని పరారైన సంఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లాపూర్, గోకుల్‌నగర్‌కు చెందిన సాయికుమార్ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం అతను అమీర్‌పేటలో క్యాబ్ నిలుపుకొని బయట నిలబడ్డాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ వ్యక్తి అన్నా అగ్గిపెట్టె ఉందా.. అంటూ మాట కలిపి అతడి చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయాడు. అతడి పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీ ఆధారంగా వివరాలు ఆరా తీస్తున్నారు.